VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 26 | శుక్రవారం 26 జూన్, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

వెనెజువెలా భూకంపాన్ని ముందే పొచ్చరించిన స్మార్ట్ ఫోన్లు!

జూన్ 25, వార్త సాక్ష్యం

ప్రకృతి విపత్తులు ఎప్పుడు, ఏ రూపంలో వస్తాయో ఎవ్వరం ఊహించలేము. ముఖ్యంగా భూకంపాలు, సునామీ లాంటి ప్రకృతి విపత్తులు క్షణాల వ్యవధిలోనే పెను విధ్వంసాన్ని సృష్టిస్తాయి. అయితే, సాంకేతికత సరిగ్గా పనిచేస్తే.. కొన్ని క్షణాల ముందస్తు సమాచారమే వేలాది మంది ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఆ మాటలను వెనెజువెలాలో -మిగతా2లో



ఇరాన్‌లో పాఠశాల పై అమెరికా క్షిపణుల దాడి.. ఖండించిన ట్రంప్

జూన్ 25, వార్త సాక్ష్యం

దక్షిణ ఇరాన్‌లోని మినాబ్‌లో పాఠశాల పై జరిగిన దాడిలో అమెరికా పాత్ర ఉందంటూ వస్తున్న వార్తలను డొనాల్డ్ ట్రంప్ ఖండించారు. ఈ దాడికి ఎవరు బాధ్యులో ఎప్పటికీ తెలియక పోవచ్చునని ఆయన తెలిపారు. బుధవారం వాషింగ్టన్ లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విలేకర్లతో -మిగతా2లో

రైతులెవరూ భయపడొద్దు.. అందరికీ యూరియా అందిస్తాం

జూన్ 25, వార్త సాక్ష్యం

జిల్లాలోని చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో ఈనెల 30న జరిగే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభా స్థలాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన కార్యక్రమం రైతు భరోసా అని చెప్పుకొచ్చారు. జులై నెలలోనే రైతులకు రైతుభరోసా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. - మిగతా2లో

మూడు రాష్ట్రాల రైతులకు కొత్త ఆశ.. తుంగభద్ర వద్ద రేవంత్ కీలక సందేశం

- తుంగభద్ర నూతన క్రస్ట్ గేట్ల ప్రారంభం
- చరిత్రలో నిలిచే ఘట్టమన్న రేవంత్
- మూడు రాష్ట్రాల రైతులకు ప్రయోజనమని స్పష్టీకరణ
- జల వివాదాలకు పరిష్కారం కావాలని ఆకాంక్ష
- కృష్ణా-గోదావరి సమస్యల పరిష్కారమవు తాయని ఆశాభావం

జూన్ 25, వార్త సాక్ష్యం

తుంగభద్ర డ్యామ్ క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ దక్షిణ భారత జలవనరుల చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలుస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కర్ణాటకలోని మునీరాబాద్‌లో నూతన క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఈ ప్రాజెక్టు మూడు రాష్ట్రాల రైతాంగ భవిష్యత్తుకు కొత్త ఆశలు నింపుతోందని పేర్కొన్నారు.

అధ్యాపక పోస్టుల భర్తీ వేగవంతం చేయండి: అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశం

- నిరుద్యోగుల కోసం జూలైలో 'నైపుణ్యం' పోర్టల్ ఆవిష్కరణ
- అన్ని ప్రభుత్వ ఐటీఐలలో ఏఐ ల్యాబ్స్ ఏర్పాటుకు చర్యలు
- ప్రతి మూడు నెలలకు ఒకసారి నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు
- ఓంక్యాప్ ద్వారా వచ్చే నెలలో 146 మందికి విదేశీ ఉద్యోగాలు

రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టింది రేవంత్ ప్రభుత్వమే

- కేసీఆర్ హయాంలో పరిశ్రమలతో భూముల విలువలు పెరిగాయని వెల్లడి
- ఎన్నికల హామీలను కాంగ్రెస్ అమలు చేయలేదని ఆరోపణ
- రైతు బంధు, దళిత బంధు అంశాల్లో ప్రజలను మోసం చేశారని విమర్శ
- 2028లో కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని కార్యకర్తలకు పిలుపు

జూన్ 25, వార్త సాక్ష్యం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు రియల్ ఎస్టేట్‌పై గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. - మిగతా2లో

విజయవాడ కస్టడీ డెత్ కేసులో సీఐ నాగరాజు అరెస్ట్

రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు వెళుతోంది: జగన్

VARTHAA SAKSHAMU
RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

ఇరాన్‌లో పాఠశాల పై అమెరికా క్షిపణుల దాడి.. ఖండించిన ట్రంప్

బుధవారం వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విలేకర్లతో మాట్లాడారు. ఈ సమస్యను ఎప్పటికైనా పరిష్కరిస్తారో లేదో తనకు తెలియదని ఆయన స్పష్టం చేశారు. జరిగిన ఈ ఘటన చాలా భయంకరమైందని అభివర్ణించారు. కానీ అన్ని చోట్లా క్షిపణులు ఎగురుతున్నాయని తెలిపారు. అయితే ఈ దాడికి పాల్పడిన క్షిపణి అమెరికాదని ఎవరో అన్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అది తమ క్షిపణి కాకపోవచ్చునని పేర్కొన్నారు. అది అమెరికాదే అని నమ్మడానికి తనకు ఎలాంటి ఆధారాలు కనిపించడం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. అది తాము చేసిందని తాను అనుకోవడం లేదని చెప్పారు. ఈ దాడికి యూఎస్ దళాలే బాధ్యత వహించే అవకాశం ఉందని ఆ దేశ మిలటరీ అంతర్గత విచారణలో వెల్లడైందంటూ ఈ ఏడాది మార్చిలో రాయిటర్స్ వెల్లడించింది. దాంతో ఈ వ్యవహారాన్ని అమెరికా రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్.. దీనిపై విచారణకు చేపట్టి ప్రాథమికంగా ఏ నిర్ధారణకు రాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ప్రారంభమైంది. అదే రోజు యూఎస్, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడి చేశాయి. ఈ దాడిలో మినాబ్‌లోని పాఠశాల్లోని 175 మంది మరణించారు. వారిలో చిన్నారులతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు. అంతర్జాతీయ మానవహక్కుల చట్టం ప్రకారం.. పాఠశాల పై ఉద్దేశపూర్వకంగా దాడి చేయడం యుద్ధ నేరం అయ్యే అవకాశం ఉంది. దాంతో పాఠశాలను వాషింగ్టన్ లక్ష్యంగా చేసుకోదని ఆమెరికా అధికారులు బహిరంగంగా వెల్లడించారు.

తెలంగాణలో 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో కొత్త ఏజెన్సీ ఏర్పాటు

ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఈ సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా (ఎండీ) నియమితులయ్యే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ నూతన ఏజెన్సీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ దాదాపు తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. పెట్టుబడిదారులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించడం, వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేయడం, సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేయడం వంటివి ఈ ఏజెన్సీ ప్రధాన విధులుగా ఉండనున్నాయి. ముఖ్యంగా ఐటీ, ఫార్మా, లాజిస్టిక్స్, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఇందులో ఒక 'ఇన్వెస్ట్ సెల్'ను కూడా ఏర్పాటు చేయనున్నారు. గత మే నెలలో ఐటీ, పరిశ్రమల శాఖలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. పెట్టుబడుల ఆకర్షణలో దూకుడుగా వ్యవహరించేందుకు తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఈ ఏజెన్సీకి ఒక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో పాటు, కీలక రంగాలకు వేర్వేరుగా డైరెక్టర్లను నియమించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన కె. రామకృష్ణారావు జూన్ 30న పదవీ విరమణ చేయనున్నారు.

అధ్యాపక పోస్టుల భర్తీ వేగవంతం చేయండి: అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశం

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టులకు గాను ఇప్పటివరకు 1,89,316 దరఖాస్తులు వచ్చాయని అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును డేటా ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. విశ్వవిద్యాలయాన్ని యూనిట్‌గా తీసుకుని నియామకాలు చేపడుతున్నందున, ఎంపిక కమిటీలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని స్పష్టం చేశారు. వీలైనంత త్వరగా ఈ నియామక ప్రక్రియను ముగించాలని ఆదేశించారు. స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుకు సంబంధించి పరిశ్రమలతో తప్పనిసరిగా ఒప్పందాలు ఉండాలని, దీని కోసం రూపొందించే చట్టం దేశానికే ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత కోసం రూపొందించిన 'నైపుణ్యం' పోర్టల్‌ను వచ్చే నెలలో ఆవిష్కరించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. దీని ద్వారా నమోదైన ప్రతి ఒక్కరికీ ఆన్‌లైన్ స్కిల్ కార్డు జారీ చేస్తామని వెల్లడించారు. పీఎం సేతు పథకం కింద మంజూరైన క్లస్టర్లలో ఐటీఐలను బలోపేతం చేయాలని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో అన్ని ప్రభుత్వ ఐటీఐలలో ఏఐ ల్యాబ్స్‌లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కార్పొరేషన్ (ఓంక్యాప్) ఆధ్వర్యంలో వచ్చే నెలలో 146 మందికి విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1,30,422 మందికి ఉద్యోగాలు లభించాయని, ఇకపై ప్రతి త్రైమాసికానికి నియోజకవర్గ కేంద్రాల్లో జాబ్ మేళాలు నిర్వహించాలని లోకేష్ ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్త, స్కిల్ డెవలప్‌మెంట్ ఎండీ గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రాష్ట్రాల రైతులకు కొత్త ఆశ.. తుంగభద్ర వద్ద రేవంత్ కీలక సందేశం

ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం గేట్ల పునరుద్ధరణను కేవలం ఇంజినీరింగ్ విజయంగా చూడలేమన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని కరవు ప్రభావిత ప్రాంతాలకు ఇది కీలక మైలురాయిగా మారుతుందని చెప్పారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలైన కర్నూలు, అనంతపురంతో పాటు తెలంగాణలోని పాలమూరు ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న నీటి కష్టాలు తనకు బాగా తెలుసన్నారు. రాష్ట్రాల మధ్య నీటి పంపకాల అంశాలు సకాలంలో పరిష్కారం కాకపోవడం వల్ల విలువైన జలాలు సముద్రంలో కలిసిపోతున్నాయని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలు, వివాదాలు పక్కనబెట్టి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. తుంగభద్ర వేదికగా మూడు రాష్ట్రాల మధ్య జరుగుతున్న చర్చలు సానుకూల దిశగా సాగుతున్నాయని సీఎం తెలిపారు. ఇదే స్ఫూర్తితో కృష్ణా, గోదావరి నదీ జలాల పంపకాల సమస్యలకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన కీలక అంశాన్ని కూడా సీఎం ప్రస్తావించారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి చట్టబద్ధంగా రావాల్సిన 10 టీఎంసీల నీరు ఇప్పటికీ రాష్ట్రానికి పూర్తిగా అందడం లేదని పేర్కొన్నారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) పరిధిలోని తెలంగాణ రైతులకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో పొరుగు రాష్ట్రాలు సహకార భావంతో వ్యవహరించాలని కోరిన సీఎం, పరస్పర అవగాహనతో ముందుకు సాగితేనే మూడు రాష్ట్రాల రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేశారు.

రైతులెవరూ భయపడొద్దు.. అందరికీ యూరియా అందిస్తాం

జులై నెలలోనే రైతులకు రైతుభరోసా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని రైతులందరికీ కలిపి రైతు భరోసా కింద రూ.9 వేల కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారన్నారు. ఈ సభకు రైతు ఆశీర్వాద సభగా రైతులే నామకరణం చేశారని తెలిపారు. భారత దేశంలో అత్యధికంగా పంటలు పండించిన రాష్ట్రం తెలంగాణ అని మంత్రి అన్నారు. వ్యవసాయ రంగంలో పంటమార్పిడి విధానంలో ఆయిల్ ఫాం సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో పది వేల ఎకరాలను రైతులు సాగు చేసే విధంగా సహకారం అందజేస్తున్నామని చెప్పారు. దేశంలో తెలంగాణలోనే అత్యధిక ఆయిల్ ఫాం సాగు జరుగుతోందన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని తెలిపారు. రెండేళ్లలో లక్ష కోట్లు రైతాంగానికి అందజేశామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేశామని అన్నారు. ఏడాదికి పది వేల కోట్లు నష్టం వచ్చినప్పటికీ కొనుగోలు చేస్తున్నామన్నారు. ఏడు రకాల వరి అందుబాటులో ఉందని రైతాంగానికి తుమ్మల తెలియజేశారు. వాతావరణ పరిస్థితులను బట్టి రైతులు పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా ఉంచుతున్నారని... నిల్వ చేసి అధిక ధరలకు అమ్మేందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఎవరూ కూడా భయపడవద్దని.. అందరికీ యూరియా అందిస్తామని స్పష్టం చేశారు. యూరియా కోసం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చామని.. అందులో అన్ని వివరాలు ఉన్నాయన్నారు. యూరియా కోసం తెచ్చిన యాప్ దేశానికే ఆదర్శమని ప్రధాని మోదీ కూడా ప్రశంసించే పరిస్థితి ఉందన్నారు. రైతాంగం పాడి పంటపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. అత్యధికంగా పురుగుల మందులు వాడుతున్నారని ఇక్కడి పంటలను విదేశాలు రిజెక్ట్ చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం కష్టంలో ఉందని, నిధుల కొరత ఉందని అయినా రైతాంగానికి అండగా ఉండాలని అప్పుచేసి మరీ రైతుభరోసా ఇస్తున్నామని చెప్పారు. ఈనెల 28న రైతు ఎగ్జిబిషన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. 28, 29 రెండు రోజుల పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సభా ప్రాంగణంలో అందుబాటులో ఉంటారన్నారు. 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ జరుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టింది రేవంత్ ప్రభుత్వమే

అధికారంలోకి వచ్చిన తర్వాత అదే రంగాన్ని పూర్తిగా దెబ్బతీశారని విమర్శించారు. చేవెళ్ల నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ముందు రూ.కోటి పలికిన ఎకరం భూమి ప్రస్తుతం రూ.50-60 లక్షలకు కూడా కొనుగోలుదారులు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. రియల్ ఎస్టేట్ పై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్ చెప్పారు. షాబాద్ పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి మైక్రోసాఫ్ట్, అమెజాన్, వెల్స్‌పన్ వంటి అంతర్జాతీయ సంస్థలను తీసుకొచ్చామని చెప్పారు. పరిశ్రమల విస్తరణతో ఒకప్పుడు రూ.30 లక్షలు ఉన్న ఎకరం భూమి విలువ రూ.3 కోట్లకు చేరిందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని కేటీఆర్ విమర్శించారు. రైతు బంధు, దళిత బంధు, ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూముల పట్టాల అంశాల్లో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. గత ప్రభుత్వ అప్పులపై విమర్శలు చేసే కాంగ్రెస్ నేతలు తమ పాలనలో చేసిన అప్పుల లెక్కలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసమే ఖర్చయ్యాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు వెళుతోంది: జగన్

ఏపీలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన కీలక హామీలను చంద్రబాబు సర్కార్ పూర్తిగా విస్మరించిందని, వడ్డీ రాయితీ పథకాన్ని నిలిపివేసి మహిళా సంఘాలను నిర్వీర్యం చేస్తోందంటూ ఎక్స్ వేదికగా ఆయన సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. ఏపీలో పన్ను ఆదాయ వృద్ధి పడిపోయిందని, రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు వెళ్తోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం డ్వాక్రా సంఘాల రుణాలపై వడ్డీ రాయితీ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని సూపర్ సిక్స్ తరహాలో హామీ ఇచ్చిందని జగన్ అన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ మాట తప్పారని మండిపడ్డారు. తమ వైసీపీ ప్రభుత్వ హయాంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.4,969 కోట్ల మేర వడ్డీ రాయితీతో పాటు ఆసరా, చేయూత వంటి స్కీమ్స్‌తో ఆర్థిక భరోసా ఇచ్చామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25 ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రాయితీ కింద ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని జగన్ ఆరోపించారు. 2025-26 బడ్జెట్‌లో రూ.100 కోట్లు, మళ్లీ ఇప్పుడు 2026-27 బడ్జెట్‌లోనూ రూ.100 కోట్లు కేటాయించినప్పటికీ.. ఆ నిధులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, గ్రౌండ్ లెవెల్లో ఒక్క పైసా కూడా విడుదల కాలేదన్నారు. ఈ వడ్డీ రాయితీ అమలు చేయకపోవడం వల్ల గత రెండేళ్లలో డ్వాక్రా మహిళలకు సుమారు రూ.6 వేల కోట్ల మేర నష్టం జరిగిందని విమర్శించారు. 2023-24లో రూ.49,696 కోట్లుగా ఉన్న డ్వాక్రా రుణ వృద్ధి.. కూటమి పాలనలో 2024-25 నాటికి రూ.41,623 కోట్లకు, 2025-26లో మరింత తగ్గి రూ.41,105 కోట్లకు పడిపోయిందని అన్నారు. అంతేకాదు, 2025-26లో రాష్ట్ర పన్ను ఆదాయ వృద్ధి -3.22 శాతంగా నమోదైందని... ఇది ఏపీలో స్పష్టమైన ఆర్థిక మాంద్యానికి సంకేతమని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న మహిళా సంఘాలను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రం మరింత సంక్షోభంలో పడుతుందని హెచ్చరిస్తూ, బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విజయవాడ కస్టడీ డెత్ కేసులో సీఐ నాగరాజు అరెస్ట్

ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన విజయవాడ కస్టడీ మరణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సస్పెండైన కృష్ణలంక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) ఎస్.ఎస్.వి.వి. నాగరాజుకు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో అధికారులు నిన్న ఆయనను భారీ భద్రత నడుమ రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. మంగళవారం సుమారు ఐదు గంటల పాటు విచారించిన అనంతరం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నాగరాజును అరెస్ట్ చేసింది. ఆ తర్వాత మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, జులై 8 వరకు రిమాండ్ విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, పోలీసులు మూడు ప్రత్యేక వాహనాల్లో కట్టుదిట్టమైన భద్రత మధ్య నాగరాజును విజయవాడ నుంచి రాజమండ్రికి తరలించారు. గాదె సాయికృష్ణ (25) అనే యువకుడి అదృశ్యం, కస్టడీ మరణం కేసులో సీఐ నాగరాజు ప్రధాన నిందితుడిగా ఉన్నారు. మే 9న మార్కాపురం నుంచి సాయికృష్ణను అదుపులోకి తీసుకుని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తరలించారని, అక్కడ చిత్రహింసలకు గురిచేయడం వల్లే అతను మరణించాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సాయికృష్ణ మరణానంతరం ఆధారాలు మాయం చేసేందుకు సీసీటీవీ ఫుటేజీని తొలగించి, మృతదేహాన్ని విద్యుత్ శ్మశానవాటికలో దహనం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై తీవ్రమైన ఆరోపణలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఐజీ ఎం. రవిప్రకాశ్ నేతృత్వంలో నలుగురు సభ్యులతో 'సిట్'ను ఏర్పాటు చేసింది. అక్రమ నిర్బంధం, కస్టడీ హింస, హత్య, ఆధారాల తారుమారు వంటి అంశాలపై సిట్ దర్యాప్తు జరుపుతోంది. ఈ కేసులో మరికొందరి ప్రమేయంపై కూడా అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR
తెలుగు దిన పత్రిక

అంబేద్కర్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ డాక్టర్ జి. ఎంజేలా ఆల్ఫ్రెడ్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 25, వార్త సాక్ష్యం

రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. ఎంజేలా ఆల్ఫ్రెడ్ అంబేద్కర్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహిస్తున్న గర్భిణీ స్త్రీల వైద్య పరీక్షల క్లినిక్ (ఆంటీనాటల్ క్లినిక్) ను పరిశీలించారు.గర్భిణీలకు అందుతున్న వైద్య సేవలు, రక్తపోటు, హీమోగ్లోబిన్, బరువు, గర్భస్థ శిశువు ఎదుగుదల తదితర పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. అలాగే ఆంటీనాటల్ రిజిస్టర్లు, గర్భిణీల నమోదు వివరాలు, హైరిస్క్ గర్భిణీల పర్యవేక్షణ రికార్డులు, మందుల పంపిణీ వివరాలను పరిశీలించారు.రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని, వైద్య సేవల అమలులో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సిబ్బందికి డీఎంహెచ్ఓ సూచించారు.ఈ సందర్భంగా డాక్టర్ జి. ఎంజేలా ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రతి గర్భిణీకి నాణ్యమైన ప్రసూతి పూర్వ వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు.రక్తహీనత, అధిక రక్తపోటు, గర్భధారణ మధుమేహం వంటి సమస్యలను ముందుగానే గుర్తించి తగిన వైద్య సలహాలు, చికిత్స అందించాలని ఆదేశించారు. తల్లి ఆరోగ్యం సురక్షితంగా ఉంటేనే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తాడని, తల్లి-శిశు మరణాలను తగ్గించడంలో ప్రసూతి పూర్వ పరీక్షలు కీలకమని పేర్కొన్నారు. ప్రతి గర్భిణీ నిర్దేశిత సమయంలో వైద్య పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని, హైరిస్క్ గర్భిణీలను ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి అవసరమైతే ఉన్నత వైద్య కేంద్రాలకు తరలించాలని సూచించారు.గర్భిణీలకు ఐరన్, కాల్షియం మాత్రలు, టీకాలు, పోషకాహారం, ప్రసూతి అనంతర సంరక్షణపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి ఒక్కరికీ స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో యూపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేఖ, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెల 28 నుంచి 30 వరకు పల్స్ పోలియో కార్యక్రమం

-0 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి

-నులిపురుగుల మాత్రల పంపిణీ, సీజనల్ వ్యాధుల నియంత్రణపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 25,వార్త సాక్ష్యం

జిల్లాలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. పల్స్ పోలియో, నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై వైద్య ఆరోగ్య శాఖ, వివిధ శాఖల అధికారులతో గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 0 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలు 41,147 మంది ఉన్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 393 పోలియో టీకా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, 38 మంది సూపర్వైజర్లను నియమించామని, 15 మొబైల్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.అన్ని మండలాల్లో ఎంపీడీఓలు, వైద్యాధికారులతో కలిసి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, పరిధిలోని 0 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంపై పాఠశాలల్లో ప్రార్థన సమయంలో, నోటీసు బోర్డుల ద్వారా, మహిళా సంఘాల సమావేశాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పిల్లలందరికీ పోలియో టీకా అందేలా చూడాలని, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల పరిధిలో విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. నులిపురుగుల నివారణ మాత్రలు పకడ్బందీగా పంపిణీ చేయాలి. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్లలోపు వయసు వారికి నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మొత్తం 1,33,695 మందికి జూలై 13వ తేదీన మాత్రలు అందించనున్నట్లు తెలిపారు. జూలై 20వ తేదీ వరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ మాత్రలు అందేలా పకడ్బందీ ప్రణాళికతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.ప్రతి మంగళ, శుక్రవారం డ్రై డే నిర్వహించాలి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పరిధిలో ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డేగా పాటించాలని కలెక్టర్ తెలిపారు.డెంగీ వ్యాధిని వ్యాప్తి చేసే దోమలు నిల్వ ఉన్న మంచి నీటిలో పెరుగుతాయని, అందువల్ల ఇళ్లలో, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. పాత టైర్లు, కూలర్లు, ఇతర నీరు నిలిచే వస్తువులను తొలగించాలని తెలిపారు.ఫాగింగ్ యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించి క్రమం తప్పకుండా ఫాగింగ్ చేపట్టాలని, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో పారిశుధ్య పనులు చేపట్టి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, వైద్యులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నంగునూరు ఉన్నత పాఠశాలకు జాతీయ స్వచ్ఛ విద్యాలయ పురస్కారం

నంగునూరు, జూన్ 25, వార్త సాక్ష్యం :

సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాతీయ స్వచ్ఛ విద్యాలయ పురస్కారాన్ని ఎంపికైంది. పారిశుద్ధ్యం, వ్యర్థ జలాల నిర్వహణ, నీటి సంరక్షణ, ఎనర్జీ సామర్థ్యం, పాఠశాల వచ్చుదనం తదితర అంశాలలో జాతీయస్థాయి పరిశీలనా బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి రేటింగ్ ఇచ్చాయి. స్వచ్ఛ విద్యాలయ రేటింగులో 92.8 స్కోర్ సాధించి జాతీయస్థాయిలో 31 వ ర్యాంకు సాధించింది. రాష్ట్రం నుంచి పది పాఠశాలలను జాతీయ స్వచ్ఛ విద్యాలయ పురస్కారానికి ఎంపిక చేయగా వీటిలో నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థానం పొందడం విశేషం. ఉమ్మడి మెదక్ జిల్లా నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒక్కటి మాత్రమే ఎంపికవడం గమనార్హం. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారానికి తమ పాఠశాల ఎంపిక కావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

వేములవాడకు తీన్మార్ మల్లన్న అక్రమ వసూళ్లపై పోరాటానికి సిద్ధం

-భక్తులపై అదనపు ఆర్థిక భారం లేకుండా చర్యలు తీసుకోవాలి: దండు వినోద్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 25, వార్త సాక్ష్యం

వేములవాడ ఆలయానికి వచ్చే భక్తుల నుంచి జరుగుతున్న అక్రమ వసూళ్లను అరికట్టడమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న త్వరలో వేములవాడకు రానున్నారని ఆ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దండు వినోద్ తెలిపారు.ఈ సందర్భంగా అక్రమ వసూళ్లపై పోరాటాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆలయాలకు వచ్చే భక్తుల విశ్వాసాన్ని ఆసరాగా చేసుకుని ఎలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడినా సహించబోమని స్పష్టం చేశారు.భక్తులకు ఎలాంటి అదనపు ఆర్థిక భారం లేకుండా దర్శనం, సేవలు అందేలా ప్రభుత్వం, దేవాదాయ శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని దండు వినోద్ డిమాండ్ చేశారు.వేములవాడలో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భక్తుల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, అవసరమైతే ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

పూర్వ విద్యార్థి నేవీలో ఉద్యోగం సాధించడం గర్వ కారణం

జూన్ 25, వార్త సాక్ష్యం

శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థి కారగిరి సాయికుమార్ ఇండియన్ నేవీలో ఉద్యోగం సాధించడం ఎంతో గర్వకారణమని పాఠశాల ప్రధానాచార్యులు సారథి రాజు అన్నారు. గురువారం మండల కేంద్రమైన శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో సాయికుమార్ కు సిబిఆర్ ప్రసాద్ చేతులమీదుగా ఘనంగా శాలువాతో సన్మానించి జ్ఞాపకను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో చదువుకున్న విద్యార్థిని, విద్యార్థులు ఉన్నత స్థానాలలో స్థిరపడ్డారని గుర్తుకు చేశారు. పూర్వ విద్యార్థి నేవీలో ఉద్యోగం సాధించడం పట్ల పాఠశాల యజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర ప్రశిక్షణ ప్రముక్ రావుల సూర్యనారాయణ, పూర్వ విద్యార్థి పరిషత్ సహ సంయోజక్ రాజారెడ్డి,విభాగ్ కార్యదర్శి సరికొండ దామోదర్, విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ కలిమహంతి వేణుమాధవ్, జిల్లా ఉపాధ్యక్షులు ధర్మపురి సుదర్శన్ తోపాటు సమితి ప్రబంధకారిణి సభ్యులు, పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాల వినియోగం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు

జూన్ 25, వార్త సాక్ష్యం

ఓదెల మండలంలోని పోత్కపల్లి రైతు వేదిక కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో విత్తన మేళా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎరువులు విత్తనాలు ఏర్పాటు చేసి అవసరమైన విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తులను రైతులకు ప్రదర్శించారు.ఈ మేళాలో 7 రకాల వరి విత్తనాలు, రైతులకు అందించారు అదేవిధంగా, నానో యూరియా, నానో డి ఏ పి అందుబాటులో పెట్టారు.రైతులకు విత్తనాల ఎంపిక, నూతన సాంకేతిక పద్ధతులు, నానో ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుత ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉన్న పరిస్థితుల్లో తక్కువ నీటి లభ్యతతో పంటను సాగు చేయడం అనుకూలమని తెలిపారు. నీటి పొదుపు పద్ధతులతో పంట సాగు చేపట్టి మంచి దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. ఆసక్తి గల రైతులు సమీపంలోని రైతు వేదికలను సందర్శించి నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని కోరారు. నాణ్యమైన విత్తనాల వినియోగం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భాస్కర్ తో పాటు ఏఈవోలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR
తెలుగు దిన పత్రిక

ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారం నింపాలి
పాస్ పోర్ట్ సైజ్ ఫొటో ఇవ్వాలి

-బూత్ లెవెల్ అధికారులు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలి

-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్

జూన్ 25, వార్త సాక్ష్యం

ఓటర్ జాబితాలో ఉన్న వారందరూ ఎన్యూమరేషన్ ఫారం తప్పనిసరిగా నింపాలని,ఫారం,ప్రస్తుత పాస్ పోర్ట్ సైజ్ ఫొటో బీఎల్ఓలకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ సూచించారు. ఎస్ఐఆర్ పై జిల్లాలోని ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బూత్ లెవెల్ అధికారులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి గురువారం జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ అనేది చాలా ప్రత్యేకమని తెలిపారు.బూత్ లెవెల్ అధికారులు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని, ఇంటింటికీ వెళ్లి ఓటర్ జాబితాలో ఉన్న వారందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని సూచించారు.ఫారాలు నింపడంలో సహాయం చేయాలని తెలిపారు.ప్రతి ఓటర్ తమ పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు సిద్ధంగా పెట్టుకోవాలని సూచించారు.బీఎల్ఓ లకు ఫారాలు,పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు వచ్చేనెల జూలై 24వ తేదీలోగా ఇవ్వాలని సూచించారు.ఈఆర్ఓ,ఏఈఆర్ఓలు,బీ ఎల్ ఓ సూపర్ వైజర్లు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలించాలని తెలిపారు.బీ ఎల్ ఓ లు తమకు అందించిన సామగ్రి,ఐడీ కార్డుతో తమ పరిధిలోని ఇండ్లకు బీఎల్ఏలతో కలిసి వెళ్లాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం,ఎన్నికల విభాగం అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనలో వైద్య విద్యార్థులు ముందుండాలి

-వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

జూన్ 25, వార్త సాక్ష్యం వనపర్తి

నషా ముక్త్ భారత్ లక్ష్య సాధనలో ప్రతి వైద్య విద్యార్థి ఒక చైతన్య దూతగా ముందుకు రావాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు.దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "నషా ముక్త్ భారత్" వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరై, జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్ తో కలిసి వైద్య విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, వాటి నివారణలో యువత, వైద్యుల బాధ్యతలపై అవగాహన కల్పించారు.అనంతరం వైద్య కళాశాల విద్యార్థులు "మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటాం... ఇతరులను కూడా దూరంగా ఉండేలా చైతన్యం కల్పిస్తాం" అంటూ యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేశారు. తదనంతరం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్స్ ఫోటో పాయింట్ వద్ద జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ, అధ్యాపకులు, విద్యార్థులు సందేశాత్మక ఫోటోలు దిగడంతో పాటు యాంటీ డ్రగ్స్ సంతకాల కార్యక్రమంలో పాల్గొని డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమ మద్దతును ప్రకటించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...వైద్య విద్యార్థులైన మీరు రేపటి సమాజానికి ఆరోగ్యాన్ని అందించే వైద్యులు. మీరు ఎంచుకున్న వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనది. అలాంటి గొప్ప లక్ష్యంతో ముందుకు సాగుతున్న మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్, మాదకద్రవ్యాలు వంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా, సంపూర్ణ ఏకాగ్రతతో వైద్య విద్యను అభ్యసించి, నైపుణ్యం కలిగిన వైద్యులుగా ఎదగాలి. మీ చేతుల్లో భవిష్యత్తులో వేలాది మంది ప్రాణాలు ఉంటాయి. అందువల్ల మీ ఆరోగ్యం, మీ వ్యక్తిత్వం, మీ క్రమశిక్షణ, మీ విలువలు సమాజానికి ఆదర్శంగా నిలవాలని, మాదకద్రవ్యాలు ఒక వ్యక్తి ఆరోగ్యాన్ని మాత్రమే కాదు... అతని ఆశయాలను, కుటుంబాన్ని, భవిష్యత్తును కూడా నాశనం చేస్తాయి. వైద్య విద్యార్థులుగా మీరు డ్రగ్స్ వల్ల శరీరంపై, మెదడుపై, మానసిక ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాలను బాగా అర్థం చేసుకునే స్థితిలో ఉన్నారు. అందుకే ముందుగా మీరే డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండి, మీ స్నేహితులు, సహ విద్యార్థులు కూడా అలాంటి వ్యసనాలకు గురికాకుండా అప్రమత్తం చేయాలని. భవిష్యత్తులో మీరు వైద్యులుగా సేవలందించే సమయంలో డ్రగ్స్ బారిన పడిన యువతకు సరైన వైద్యం, కౌన్సెలింగ్ అందించి వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాలి. మంచి వైద్యుడు వ్యాధులను మాత్రమే కాదు... సమాజంలోని చెడు వ్యసనాలను కూడా నిర్మూలించే దిశగా పనిచేయాలి. మీ విద్య కేవలం డిగ్రీ కోసమే కాదు... సమాజ ఆరోగ్యాన్ని కాపాడే మహత్తర బాధ్యత కోసం అన్న విషయాన్ని ఎప్పటికీ గుర్తుంచుకోవాలని ఎస్పీ గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వనపర్తి అదనపు ఎస్పీ, రాజేష్ మీనా ఐపీఎస్, వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్, జ్యోతి రెడ్డి, వైద్యకళాశాల ఆర్గనైజర్, డా,హరికృష్ణ, వనపర్తి సీఐ రత్నం, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, నార్కోటిక్ ఎస్సై, అంజద్ అధ్యాపకులు, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రక్షాళనకు 'ఎస్.ఐ.ఆర్' శ్రీకారం కలెక్టర్ రాజర్షి షా

జూన్ 25, వార్త సాక్ష్యం

నేటి నుంచి జూలై 24 వరకు ఇంటింటికీ బూత్ స్థాయి అధికారులు(బి ఎల్ ఓ)అపోహలు నమ్మొద్దు నిజమైన ఓటర్ల పేర్లు తొలగించం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ఓటర్ల జాబితాలో లోపాలను సవరించి, పారదర్శకమైన జాబితాను రూపొందించేందుకు తెలంగాణ వ్యాప్తంగా ఆదిలాబాద్ జిల్లాలో 'ఎస్. ఐ.ఆర్'(ఎస్ ఐ ఆర్) ప్రక్రియ గురువారం నుండి అధికారికంగా ప్రారంభమైంది.ఈ ప్రత్యేక ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు(బి.ఎల్.ఓ) నేరుగా ఓటర్ల ఇళ్లకు వస్తారని ఆయన పేర్కొన్నారు. స్వయంగా ఓటు వివరాలు సరిచూసుకున్న కలెక్టర్ ఈ ప్రచారంలో భాగంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ స్వయంగా తన ఓటు వివరాలను పరిశీలించుకున్నారు. బి.ఎల్.ఓ కలెక్టర్ నివాసానికి రాగా ఆయన రీప్రింటెడ్ ఎనిమరేషన్ ఫామ్ ద్వారా తన ఓటు వివరాలను క్షుణ్ణంగా సరిచూసుకున్నారు. గతంలో 2002 ఓటర్ జాబితా ప్రకారం ఉన్న తన వివరాలను నమోదు చేసి,ఒక స్పష్టమైన ఫోటోను జతపరిచి బి.ఎల్.ఓకు అందజేశారు. కలెక్టర్ తన పాత జ్ఞాపకాలను పంచుకుంటూ "ప్రస్తుతం నా ఓటు ఆదిలాబాద్‌లోనే ఉన్నప్పటికీ,2002 నాటికి ఇక్కడ లేదు. అప్పట్లో మా తండ్రి గారి ఓటు బీహార్‌లోని అరరియా జిల్లా, ఫార్బిస్‌గంజ్ నియోజకవర్గంలో ఉండేది. గతంలోనే దానికి సంబంధించిన మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసినందున.ఇప్పుడు అదే వివరాలను ఫామ్‌లో నింపి బి.ఎల్.ఓకు అందజేశాను.ఆ వివరాలను బి.ఎల్.ఓ వెంటనే 'బి.ఎల్.ఓ యాప్'(బి ఎల్ ఓ యఫ్) లో వెరిఫై చేసి సబ్మిట్ చేశారు. "ప్రస్తుతం సాగుతున్న ఈ ఎనిమరేషన్ ప్రక్రియ ఈ రోజు నుండి జూలై 24వ తేదీ వరకు నిరంతరా యంగా కొనసాగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఓటర్లలో ఉన్న కొన్ని అపోహలపై ఆయన క్లారిటీ ఇచ్చారు. తమ తల్లిదండ్రుల ఓట్లు వేరే రాష్ట్రాల్లోనో లేదా ఇతర జిల్లాల్లోనో ఉన్నాయని చెబితే, ఇక్కడున్న తమ ఓటు ఎక్కడ కట్ అయిపోతుందోనని కొందరు భయపడుతున్నారని అలాంటి అపోహలను అస్సలు నమ్మవద్దని ఆయన హామీ ఇచ్చారు. అర్హులైన, నిజమైన ఓటర్ల ఓట్లు ఎట్టిపరిస్థితుల్లోనూ తొలగించబడవని స్పష్టం చేశారు.జూలై 31న 'డ్రాఫ్ట్ రోల్' విడుదల ఈ ఎనిమరేషన్ ఫామ్స్ సమర్పించిన తర్వాత జూలై 31న 'డ్రాఫ్ట్ రోల్' (ముసాయిదా ఓటర్ల జాబితా) ప్రచురించబడుతుందని కలెక్టర్ తెలిపారు. అందులో 2002 డేటాబేస్ ప్రకారం వివరాలు నింపి ఇచ్చిన వారందరి ఓట్ల వివరాలు ఉంటాయని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఓట్ల తొలగింపుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. నిజమైన ఓటర్లందరూ తప్పకుండా ఈ ఎనిమరేషన్ ఫామ్‌ను నింపి,అందులో తమ వివరాలతో పాటు తల్లిదండ్రులు,తాతయ్య, నానమ్మ లేదా గార్డియన్ల ఓట్ల వివరాలను నమోదు చేయాలని సూచించారు. నింపిన ఫామ్‌లలో ఒక కాపీ ఓటర్ వద్ద భద్రంగా ఉంటుందని,మరొకటి బి.ఎల్.ఓకు ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ నాలుగు హత్యల కేసులో కీలక పరిణామం

-హసీన మొదటి భర్త కూతురు, అల్లుడు కుటుంబం పక్కా ప్లాన్

-హైదరాబాద్ పాతబస్తీకి చెందిన వారికి సుఫారి

-హసీన పేరుతో ఉన్న ఆస్తి హత్యలకు కారణం

-పోలీసుల అదుపులో నిందితులు

జూన్ 25, వార్త సాక్ష్యం

నల్లగొండ జిల్లా కేంద్రంలో సంచలనం సృష్టించిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు హత్యల కేసును పోలీసులు ఛేదించే దిశలో కీలక పరిణామం వెలుగులోకి వచ్చింది. కుటుంబ ఆస్తి వివాదమే ఈ దారుణ హత్యలకు ప్రధాన కారణమని దర్యాప్తులో తేలినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. హత్యకు గురైన సుల్తాన్ (45), హసీన (40),ముజమిల్ (20), అక్సర (11)లను ముందస్తు ప్రణాళిక ప్రకారం హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు.హసీన పేరుపై సుమారు రూ.కోటి విలువైన స్థిరాస్తులు ఉండగా,ఆ ఆస్తిని ఇతరులకు కాకుండా సుల్తాన్ పిల్లలకు ఇవ్వాలనే నిర్ణయంతో ఉండగా,హసీన మొదటి భర్త కుమార్తె,ఆమె భర్త,అల్లుడి అక్క కలిసి కుట్ర పన్నినట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలుస్తోంది.ఈ హత్యల కోసం హైదరాబాద్ పాతబస్తీకి చెందిన నలుగురు రౌడీషీటర్లకు సుపారీ ఇచ్చి నేరానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికలోనూ హత్యల క్రూరత్వం వెలుగుచూసింది.సుల్తాన్ శరీరంపై 6 కత్తిపోట్లు, హసీనపై 7,అక్సరపై 9, ముజమిల్‌పై ఏకంగా 16 కత్తిపోట్లు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. హంతకులకు భయపడి మంచం కింద దాక్కున్న చిన్నారి అక్సరను బయటకు లాగి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసులో మరిన్ని నిందితుల ప్రమేయం,కుట్రకు సంబంధించిన ఇతర వివరాలపై పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా వెల్లడించే అవకాశం ఉందని సమాచారం. అందుతున్న సమాచారం ప్రకారం. హసీనా మొదటి భర్తతో కలిసి ఉన్నప్పుడు వారసత్వంగా వచ్చిన ఆస్తులు హసీనా పేరు పైన గతంలో రిజిస్టర్ చేయించారు. అయితే అతనితో విడాకులు అయినప్పుడు ఆమెకు భరణంగా కొంత డబ్బులు ఇచ్చారు. ఆ డబ్బులతో ఆమె నల్గొండలో ఇల్లు కొనుక్కుంది.తదుపరి ఆమె పేరు మీద ఉన్న వ్యవసాయ భూమిని తనకు ఇవ్వాలని భర్తతో పాటు కూతురు అల్లుడు కూడా పలుమార్లు అడిగినట్లు తెలుస్తోంది. కానీ,హసీనా అందుకు ఒప్పుకోలేదు. దీంతో వ్యవసాయ భూమికి సంబం ధించిన పాస్ బుక్కులను ఎలాగైనా కాజేయాలని ఆలోచనతో గతంలో దొంగతనానికి పాల్పడినట్లు సమాచారం. కానీ, వాళ్ళకి పాస్ బుక్కులు దొరకకపో వడంతో ఇటీవల కాలంలో మిర్యాలగూడకు సంబంధి ంచిన ఫంక్షన్ హైదరాబాదులో జరిగినప్పుడు అక్కడ కూడా తగువు జరిగినట్లు సమాచారం.ఈ వ్యవసాయ భూమిని సుమారు రెండు కోట్లకు పైగా ఉంటుందని అంచనా.అందుకోసమే కన్న కూతురే ఆస్తి కోసం మెయిన్ విలన్ గా మారి,భర్త,కుటుంబ సభ్యుల మద్దతుతో సుఫారి గ్యాంగ్ తో హత్య చేయించినట్లు సమాచారం.

ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

జూన్ 25, వార్త సాక్ష్యం :

ప్రజా ఆరోగ్యం దృష్ట్యా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,ఉప కేంద్రాల ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని,ఈ క్రమంలో ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సంద ర్శించి వార్డులు,రిజిస్టర్లు, ల్యాబ్, పరిసరాలను పరిశీలించి అధిక శాతం నమోదు అవుతున్న వ్యాధులు, అందిస్తున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. వైద్య రంగ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రులు,ఆరోగ్య కేంద్రాలను ఆధుని కరిస్తూ, ఆధునిక సాంకేతిక పరికరాలను సమకూర్చి ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలం అయినందున వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని,అవసరమైన మందుల నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది నిధుల పట్ల సమయపాలన పాటించాలని,ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యా రంగంలో ఆచరణాత్మక మార్పులను తీసుకువస్తూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని వెంకట రావుపేట గ్రామంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులకు కార్య క్రమం నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయడం,తిరిగి సేకరిం చడం, వివరాల నమోదు అంశాలలో జాగ్రత్త వహించాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సందర్శించి తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని,కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR
తెలుగు దిన పత్రిక

ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

-ఓటరు జాబితా సవరణలో మొదటి దశను పకడ్బందీగా నిర్వహించాలి..

-ఇంటింటికీ వెళ్ళి ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందించాలి..

-పారదర్శక ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములు కావాలి

-జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీఎల్ఓకు వివరాలు నమోదు చేసిన వ్యక్తిగత ఎన్యుమరేషన్ ఫారమ్‌ను అందజేసిన జిల్లా కలెక్టర్...

జూన్ 25, వార్త సాక్ష్యం

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించే హౌస్-టు-హౌస్ ఎన్యుమరేషన్ ప్రక్రియ అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం ప్రారంభమైన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరం 46వ డివిజన్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీఎల్ఓ జిల్లా కలెక్టర్‌కు వ్యక్తిగత ఎన్యుమరేషన్ ఫారమ్‌ను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్వయంగా ఫారమ్‌లో వివరాలు నమోదు చేసి అధికారులకు తిరిగి సమర్పించారు. ఎస్ఐఆర్ కార్యక్రమ నిర్వహణ, ఫారమ్‌ల పంపిణీ, సేకరణ విధానాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హత గల ఓటరును గుర్తించి, వారి వివరాలను సక్రమంగా నమోదు చేయడం ద్వారా పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఎన్నికల సంఘానికి క్షేత్రస్థాయి ప్రతినిధులుగా వ్యవహరిస్తారని, వారి పని తీరుపైనే ఈ కార్యక్రమం విజయవంతం ఆధారపడి ఉంటుందని అన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసే సమయంలో ప్రజలకు తలెత్తే సందేహాలను నివృత్తి చేస్తూ, కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో మొదటి నాలుగు నుంచి ఐదు రోజులలోపు ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారమ్‌లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఫారమ్‌లను అందజేసే సమయంలో వాటిని పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని కుటుంబ సభ్యులకు తెలియజేయాలని, తదుపరి సందర్శనలో వాటిని సేకరిస్తామని స్పష్టం చేయాలని చెప్పారు. ఫారమ్‌లు సమర్పించని పక్షంలో సంబంధిత వ్యక్తుల పేర్లు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో కనిపించవని ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. నిరక్ష రాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు లేదా ఫారమ్‌లు స్వయంగా నింపలేని వారికి బీఎల్ఓలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఓటరుకి తప్పని సరిగా ఎన్యుమరేషన్ ఫారమ్ అందేలా చూడాలని, ఇంట్లో లేని సందర్భాల్లో కనీసం మూడు సార్లు సందర్శించి ఫారమ్ అందించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఫారమ్ పంపిణీ జరిగినట్లు రసీదు లేదా ఇతర ఆధారాలు భద్రపరచుకోవాలని తెలిపారు. 2002 ఓటరు జాబితాలో ఇప్పటికే పేరు ఉన్న అర్హులైన ఓటర్ల నుంచి ఈ దశలో ఎలాంటి సహాయక పత్రాలు తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఓటరు జాబితాను 2002 జాబితాతో మ్యాపింగ్ చేసి, వివరాలు ధృవీకరించి సంతకం తీసుకుంటే సరిపోతుందని తెలిపారు. జూలై 31న ప్రచురించే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఎన్యుమరేషన్ ఫారమ్‌లు సమర్పించిన వారి పేర్లు మాత్రమే ఉంటాయని, ప్రతినిధులుగా ఫారమ్‌లు ఇవ్వని వారి పేర్లు జాబితాలో కనిపించకపోవచ్చని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో నివాసం మారిన వారు, అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారు, కొత్తగా వచ్చిన నివాసితుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని సూచించారు. ఇతర నియోజక వర్గాల్లో ఓటర్లుగా ఉన్నవారిని ఫారమ్-8 ద్వారా ఓటు బదిలీ చేయించే చర్యలు చేపట్టాలని తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి అర్హుడికి ఫారమ్-6 అందించి కొత్త ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎవరైనా ఓటరు మరణించినట్లు, నివాసం మార్చుకున్నట్లు లేదా అక్కడ నివసించడం లేదని సమాచారం వచ్చినప్పుడు తగిన ఆధారాలు, స్థానికుల వాంగ్మూలాలు నమోదు చేయాలని, సరైన ధృవీకరణ లేకుండా ఏ ఓటరు పేరును తొలగించరాదని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణలో పారదర్శకత, నిష్పాక్షికత తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొంటున్న బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్వోలు, ఈఆర్వోలు, రాజకీయ పార్టీల బీఎల్ఏలు రాబోయే మూడు నెలలపాటు ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరుని చేరుకుని వారి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా ఈఆర్వోలు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఫారమ్‌ల పంపిణీ నుంచి సేకరణ వరకు ప్రతి దశలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బీఎల్ఓలు తమ సాధారణ విధులతో పాటు ఎన్నికల సంఘం నిర్దేశించిన ఎస్ఐఆర్ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వోలు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాచకొండ కోట వెనుక అసలు చరిత్ర ఇదేనా

-600 ఏళ్ల క్రితం రాజులు రాత్రికి రాత్రే ఎందుకు వదిలేశారు?

-దెయ్యాల కోటా..శాపగ్రస్త రాజధానా?

-చరిత్రను ముసుగు కప్పిన జానపద కథలా?

జూన్ 25, వార్త సాక్ష్యం

చారిత్రక కట్టడాలు,పురాతన కోటల గురించి మాట్లాడినప్పుడు వాటి చుట్టూ ఎన్నో కథలు,పుకార్లు వినిపించడం సహజం.ఒకప్పుడు రాజుల వైభవానికి ప్రతీకగా నిలిచిన ప్రాంతాలు కాలక్రమేణా శిథిలాలుగా మారిన తర్వాత వాటి చుట్టూ దెయ్యాల కథలు,శాపాల కథలు అల్లుకుపోవడం మన దేశంలో తరచూ కనిపించే విషయం. అలాంటి చారిత్రక ప్రాధాన్యం కలిగిన కోటల్లో యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాచకొండ కోట ఒకటి. హైదరాబాద్‌కు సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కోట గురించి చాలామందికి తెలియదు. గోల్కొండ, భువనగిరి కోటలకు ఉన్నంత ప్రచారం రాచకొండకు లేకపోయినా,చరిత్రలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది.14వ శతాబ్దంలో పద్మనాయక (వెలమ) రాజులు తమ రాజధానిగా ఈ కోటను నిర్మించారు. నాటి దక్కన్ వాస్తుశిల్పానికి ఇది అద్భుత నిదర్శనంగా నిలిచింది.సున్నం లేకుండా నిర్మించిన అద్భుత రాచకొండ కోట నిర్మాణ ప్రత్యేకతే దాని బలం.భారీ గ్రానైట్ రాళ్లను ఎలాంటి సున్నం లేదా బంధన పదార్థాలు ఉపయోగించకుండా ఒకదానిపై ఒకటి పేర్చి నిర్మించారు. సహజ కొండలనే రక్షణ కవచా లుగా మార్చి,శత్రువులు సులభంగా చేరుకోలేని విధంగా వ్యూహాత్మకంగా నిర్మించారు. నాటి ఇంజినీ రింగ్ నైపుణ్యానికి ఇది నిదర్శనం.

-రాజులు ఎందుకు కోటను విడిచిపెట్టారు..?

రాచకొండ కోటను రాజులు ఎందుకు విడిచిపెట్టారన్నది ఇప్పటికీ ప్రజల్లో ఆసక్తికరమైన చర్చ ఉంది. స్థానికంగా అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి.కొందరి కథనం ప్రకారం, ఒక రాజు ఆధ్యాత్మిక శక్తులు కలిగిన మహిళను అవమాని ంచడంతో ఆమె శాపం వల్ల రాజ్యం పతనమైందని చెబుతారు. మరికొందరు ఒక మహర్షిని అవమాని ంచడం వల్ల కోట శాపగ్రస్తమైందని అంటారు.ఈ కథలకు చారిత్రక ఆధారాలు లేవు. చరిత్రకారుల అభిప్రాయం మాత్రం భిన్నంగా ఉంది. బహమనీ సుల్తానుల విస్తరణ,మారుతున్న రాజకీయ పరిస్థి తులు, యుద్ధ వ్యూహాలు వంటి కారణాల వల్లే పద్మనాయక రాజులు రాచకొండను విడిచి కొత్త రాజధానిని ఎంచుకున్నారని చారిత్రక ఆధారాలు సూచిస్తున్నాయి.

-దెయ్యాల కోటా పేరెందుకు..?

రాచకొండ కోటను దెయ్యాల కోటగా కొందరు ప్రచారం చేసినప్పటికీ, అలాంటి ప్రచారాలకు శాస్త్రీయ లేదా చారిత్రక ఆధారాలు లేవు. కాలక్రమేణా ప్రజల్లో పుట్టిన జానపద కథలు మాత్రమే ఇవని చరిత్ర పరిశోధకులు చెబుతున్నారు. ట్రెక్కింగ్ ప్రియులకు స్వర్గధామంగా ప్రస్తుతం రాచకొండ కోట ట్రెక్కింగ్ ప్రియులను ఆకర్షిస్తోంది. కోటపైకి చేరుకోవడానికి ప్రత్యేక మెట్లు లేదా సిమెంట్ రోడ్లు లేవు.రాతి బండలు, కొండచరియలు,పచ్చని ప్రకృతి మధ్య నడుస్తూ శిఖరాన్ని చేరుకోవాల్సి ఉంటుంది.ఈ ప్రయాణం కొంత శ్రమతో కూడుకున్నదే అయినప్పటికీ,ప్రకృతి ప్రేమికులకు అరుదైన అనుభూతిని అందిస్తుంది.కోట శిఖరానికి చేరుకుంటే ఎటు చూసినా పచ్చని లోయలు, కొండలు, ప్రశాంతమైన వాతావరణం కనువిందు చేస్తాయి. ముఖ్యంగా సూర్యాస్తమయం సమయంలో రాతి గోడలపై పడే బంగారు కిరణాలు కోటకు మరింత అందాన్ని తెస్తాయి.వెళ్లే ముందు గుర్తుంచు కోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి. కోటకు వెళ్లే మార్గంలో భద్రతా రెయిలింగ్స్, కంచెలు లేవు. రాతిబండలపై నడవాల్సి ఉండటంతో జాగ్రత్త అవసరం.కోట పరిసరాల్లో దుకాణాలు లేదా తాగునీటి సౌకర్యం లేదు.నీరు,తేలికపాటి ఆహారం వెంట తీసుకెళ్లడం మంచిది.వర్షాకాలంలో రాళ్లు జారే అవకాశం ఉండటంతో మరింత అప్రమత్తంగా ఉండాలి.చరిత్రను చెప్పే రాచకొండ రాచకొండ కోట కేవలం శిథిలమైన కట్టడం కాదు. అది కాకతీయుల అనంతర కాలంలో వెలసిన పద్మనాయకుల వైభ వానికి, నాటి సైనిక వ్యూహాలకు, అద్భుత వాస్తు శిల్పానికి సజీవ సాక్ష్యం.దెయ్యాల కథలు, శాపాల ప్రచారాల కంటే ఈ కోట వెనుక ఉన్న నిజమైన చరిత్రనుతెలుసుకోవడం మరింత ఆసక్తికరం. ప్రకృతి, చరిత్ర, సాహసంఈ మూడింటినీ ఒకే చోట ఆస్వాదిం చాలనుకునే వారికి రాచకొండ కోట ఒక అపూర్వమైన పర్యాటక గమ్యస్థానం.

దేశ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు

-అధికారం కోసం నియంతగా మారినా ఇందిరాగాంధీ

-ఎమర్జెన్సీ డే కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

జూన్ 25, వార్త సాక్ష్యం

భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో జూన్ 25 చీకటి రోజు అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఎమర్జెన్సీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 1971 ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఉత్తర ప్రదేశ్ లోని రాయ్ బరేలీ లో పోటీ చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలిపారు. దీంతో అలహాబాద్ హైకోర్టు నాలుగు సంవత్సరాలు విచారించిన తర్వాత అధికార దుర్వినియోగం జరిగిందని తీర్పునిచ్చిందని చెప్పారు. ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలాగే ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయరాదని నిషేధం విధించిందన్నారు. కానీ ఇందిరా గాంధీ రాష్ట్రపతిని కలిసి అంతర్గత భద్రత కారణాన్ని చూపి ఎమర్జెన్సీ ప్రకటించడం జరిగిందన్నారు. ప్రతిపక్ష నేతలైన అటల్ బిహారీ వాజ్‌పేయి, అద్వానీ, మొరార్జీ దేశాయ్ లాంటి వారిని వారెంట్ లేకుండా అరెస్టు చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసిన పత్రిక కార్యాల యాలు విద్యుత్ కోతను విధించడం జర్నలిస్టులను జైల్లో పెట్టించడం జరిగిందన్నారు. బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించడం ప్రజల స్వేచ్ఛను పూర్తిగా హరించారని విమర్శించారు. అలాగే ఇందూరు నుంచి అనేకమంది ఎమర్జెన్సీ కాలంలో జైలు శిక్షణ అనుభవించారని గుర్తు చేశారు. అలాగే జూన్ 25న సంవిధాన్ హత్య దివస్ గా పటిస్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాలంలో జైలుకు వెళ్లిన వారి త్యాగాలను వృధా కానివ్వమన్నారు. ఇందిరా గాంధీ కుమారుడు సంజీవ్ గాంధీ రాజ్యాంగ సవరణ చేయాలనే ప్రయత్నం చేశారని తెలిపారు. ఎమర్జెన్సీని అడ్డుగా పెట్టుకొని నియంతలా పాలించారని మండిపడ్డారు. అంతకుముందు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లిన సంఘ్ నేతలు రాజేశ్వర్, సిలివేరు శ్రీధర్ లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆనాటి అనుభవాలను వారిరువురు పంచుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు బెల్లాల్ శశాంక్, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసన్న సత్యపాల్, సుమిత్ర కిషోర్, ప్రసూన శ్రీనివాస్, ఓబీసీ మోర్చ నాయకుడు స్వామి యాదవ్, ఆయా మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జూన్ 25, వార్త సాక్ష్యం

మేడిపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మమేకమై వారికి పాఠాలు బోధించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని తెలుసుకుంటూ విద్యా ప్రమాణాల పై ఆరా తీశారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతున్నదీ లేనిదీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యతను విద్యార్థులతో కలిసి సహబంతి భోజనం చేశారు, పరిశుభ్రత, పాఠశాల నిర్వహణ పై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థినుల కోసం అదనపు డార్మెటరీ అవసరాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే డార్మెటరీ నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్‌కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి జయరాజ్, తహసీల్దార్, పాఠశాల సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR
తెలుగు దిన పత్రిక

పోస్టల్ అకౌంట్ లో నుండి 2లక్షల మాయం

-పోస్ట్ ఆఫీస్ అధికారి మోసానికి బలైన నిరుపేద ఒంటరి మహిళ
-కొత్తగూడ మండల పోస్ట్ ఆఫీసులో అప్పటి బ్రాంచ్ మేనేజర్ రమేష్ నిర్వాహకం

జూన్ 25, వార్త సాక్ష్యం మహబూబాబాద్

జిల్లాలోని కొత్తగూడ మండల పోస్ట్ ఆఫీసులో గతంలో పోస్ట్ బ్రాంచ్ మేనేజర్ గా పని చేసిన ఉద్యోగి నిర్వాహకంతో ఓ ఒంటరి కుటుంబం వీధిన పడింది.కొత్తగూడకు చెందిన సందీప్ అనారోగ్యంతో మృతి చెందగా,ఆయన భార్య రచన తన పసిబిడ్డతో ఒంటరిగా జీవిస్తోంది.ఆ కుటుంబం పరిస్థితిని చూసి చలించిన దాతలు,రచన కోసం సుమారు రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు.ఈ మొత్తాన్ని ఆమె (రచన)తన బిడ్డ కోసం కొత్తగూడ పోస్ట్ ఆఫీసులో భద్రపరుచుకుంది. అప్పటి బ్రాంచ్ మేనేజర్ రమేష్,రచనకు తెలియకుండానే ఆ సొమ్మును 27-12-2025 లో డ్రా చేసి కాజేశాడు. ఆ తర్వాత బదిలీపై అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. బయట పడిన నిజం. రాజీకి ప్రయత్నాలు ఇటీవల తన ఖాతాలో నగదు లేదని గ్రహించిన బాధితురాలు రచన ఒక్కసారిగా షాక్‌కు గురైంది.తన పసిబిడ్డ భవిష్యత్తు కోసం దాచుకున్న డబ్బు మాయం కావడంతో ఆమె కన్నీరుమున్నీరవుతోంది.విషయం బయటకు పొక్కడంతో,నిందితుడు రమేష్ తన బంధువుల ద్వారా బాధితురాలికి ఫోన్లు చేయిస్తూ.. రాజీకి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ దారుణంపై స్థానికులు,ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.పోస్ట్ ఆఫీస్ వంటి బాధ్యతాయుతమైన శాఖలో పని చేసే అధికారి,ఒక నిరుపేద మహిళ నోటికాడ కూడును లాక్కోవడంపై మండిపడుతున్నారు. ఇలాంటివి ఇంకా ఎన్ని స్కామ్ లు చేసి ఉంటారని ఆ. దొంగ అధికారి రమేష్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా,తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

-బీ.ఎల్.వో.ల ఇంటింటి ఫారాల పంపిణీని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్

జూన్ 25, వార్త సాక్ష్యం జగిత్యాల:

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్)కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ గ్రామంలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. బీఎల్‌వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాల ను నిర్దిష్ట గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థ ను మరింత బలోపేతం చేసే కీలక ప్రక్రియ అని పేర్కొన్న కలెక్టర్, అధికారులు, బీఎల్‌వోలు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, తహసీల్దార్ హకీమ్,సంబంధిత సిబ్బంది, బీఎల్‌వోలు మరియు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా గరిడేపల్లి బస్టాండ్

ఎండలోనే బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ

-నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి రాని బస్టాండ్
-మహిళలు,వృద్ధులు,విద్యార్థుల ఇబ్బందులు
-వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికుల విజ్ఞప్తి

జూన్ 25, వార్త సాక్ష్యం

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్టాండ్ వినియోగంలోకి రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.బస్టాండ్ భవనం అందుబాటులో ఉన్నప్పటికీ బస్సులు అక్కడికి రాకపోవడంతో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, ఉద్యోగులు రోడ్డుపైనే ఎండలో, వర్షంలో నిలబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, బస్టాండ్ ప్రయోజనం వారికి అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వేసవి ఎండలు,వర్షాకాలంలో వానలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్టాండును వెంటనే పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంతో పాటు తాగునీరు, కూర్చునే సౌకర్యం, పరిశుభ్రత వంటి మౌలిక వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన బస్టాండ్ ప్రజలకు ఉపయోగపడేలా తక్షణ చర్యలు తీసుకోవాలని గరిడేపల్లి ప్రజలు, మహిళలు, విద్యార్థులు, ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

తెలంగాణలో చేయూత పింఛన్ల పథకంపై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

-అనర్హులను గుర్తించే సర్వే ఈ నెలాఖరుతో ముగియనుంది
-వచ్చే నెల నుంచి అర్హులైన వారి మంజూరు కోసం దరఖాస్తులు
-దరఖాస్తులను పరిశీలించి అర్హులైనవారికి పింఛన్ల పంపిణీ
-ఈ నెలాఖరుకు సర్వే పూర్తి బ్యాంక్ అకౌంట్లలో నేరుగా జమ.

జూన్ 25, వార్త సాక్ష్యం రంగారెడ్డి జిల్లా

తెలంగాణ ప్రభుత్వం కొత్త పింఛన్ల పంపిణీపై కీలక ప్రకటన చేసింది. కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నవారికి తీపికబురు అందించింది. వచ్చే నెల నుంచి కొత్త పించన్ల జారీ కోసం దరఖాస్తులను ఆహ్వానించనుంది. అటు అనర్హులను గుర్తించే సర్వే ఈ నెలాఖరుతో ముగియనుంది. తెలంగాణలో చేయూత పింఛన్ల పథకంపై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త పింఛన్ల పంపిణీపై కీలక అప్డేట్ ఇచ్చింది. వచ్చే నెల నుంచి కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించాలని నిర్ణయించింది. అర్హులైనవారి నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. అనంతరం దరఖాస్తులను పరిశీలించి అర్హులైనవారికి పింఛన్లను పంపిణీ చేయనున్నారు. అర్హులైన ప్రతీఒక్కరికీ పింఛన్లు అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. గ్రామాలు, పట్టణాల్లో సెర్ప్ అధికారులు సర్వే చేపడుతున్నారు. ఈ క్రమంలో తమకు అర్హత ఉన్నా పింఛన్లు ఇవ్వడం లేదని వృద్ధులు దివ్యాంగులు ఒంటరి మహిళలు ఫిర్యాదు చేస్తున్నారు. తమకు పింఛన్లు అందించాలని వినతి పత్రాలు అందిస్తున్నారు.

-వచ్చే నెల నుంచి అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరు

ఈ క్రమంలో అర్హులైనవారికి కొత్త పింఛన్లను మంజూరు చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. అయితే అనర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం సర్వే చేపడుతోంది. ఈ సర్వే తుది దశకు చేరుకుంది. ఈ నెలాఖారుతో సర్వే ముగియనుండగా వచ్చే నెల నుంచి కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. కొంతమంది అర్హత లేకపోయినా పింఛన్ పొందుతున్నారు. అలాగే మరణించినవారు, వలస వెళ్లిపోయినవారు, వేరే ప్రాంతాల్లో స్థిరపడినవారు కూడా ఉన్నారు. దీని వల్ల నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, లబ్ధిదారుల జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో నిజమైన లబ్ధిదారులకు మాత్రమే పింఛన్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పేదరిక నిర్మూలన సంస్థను రంగంలోకి దింపింది. ఈ సంస్థ లైవ్ అథెంటికేషన్ సర్వే చేపడుతోంది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి అనర్హులను గుర్తిస్తోంది. ఈ నెలాఖరుకు సర్వే పూర్తి బ్యాంక్ అకౌంట్లలో నేరుగా జమ. రాష్ట్రంలో మొత్తం 42 లక్షల మంది పింఛన్లు పొందుతున్నారు. వీరిలో బ్యాంక్ అకౌంట్లలో నేరుగా పింఛన్లు పొందుతున్నవారు 19,04,239 మంది ఉన్నారు. వీరిలో 93,624 మందిని అనర్హులుగా గుర్తించింది. 40,751 మంది మరణించగా వీరి పేరిట ఇంకా నిధులు విత్ డ్రా అవుతున్నట్లు తేలింది. 41,689 మంది ఆచూకీ లభించడం లేదు. 3,495 మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లగా 11 వేల మంది ఆధార్లు చెల్లకపోగా వారి ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయి. ప్రస్తుతం 15.97 లక్షల మంది సర్వే పూర్తి చేశారు. ఈ నెలాఖరు నాటికి 100 శాతం సర్వే పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పెన్షన్లలో పారదర్శకత తెచ్చేందుకు ఈ మెగా సర్వే చేపడుతున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. కాగా పించన్లను బ్యాంక్ అకౌంట్లలో నేరుగా జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు పోస్టాఫీసుల ద్వారా పింఛన్ల కోసం అందించేవారు.అయితే ఇక నుంచి నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని ఇటీవల అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు.

ప్రభుత్వభూములు,చెరువుల కబ్జాల నియంత్రణలో హైడ్రా మరో అడుగు

-శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో ఆక్రమణకు గురైన 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా
-హైటెక్స్ సమీపంలో ఐటీ కారిడార్‌లో ఆక్రమణకు గురైన 1000 కోట్లభూమి
-ఆక్రమణలు తొలగించి 5 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్

జూన్ 25, వార్త సాక్ష్యం రంగారెడ్డి జిల్లా

శేరిలింగంపల్లి మండలం హైటెక్స్ సమీపంలోని ఖానామెట్‌లో ఆక్రమణకు గురైన రూ.1000 కోట్ల విలువైన 5 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా రక్షించింది. అక్రమ నిర్మాణాలు తొలగించి ఫెన్సింగ్, బోర్డులు ఏర్పాటు చేసింది.ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జాల నియంత్రణలో హైడ్రా మరో అడుగు ముందుకేసింది. ఐటీ కారిడార్‌లో ఆక్రమణకు గురైన రూ.1000 కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా కాపాడింది. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు హైటెక్స్ సమీపంలోని ఖానామెట్ సర్వే నెంబర్ 42లో ఉన్న 5 ఎకరాల్లో అక్రమంగా వెలసిన నిర్మాణాలను నేలమట్టం చేసి ప్రభుత్వ భూమిగా డిక్లేర్ చేస్తూ ఫెన్సింగ్, బోర్డు ఏర్పాటు చేసింది. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లోని సర్వే నంబరు 42లో మెటల్ చార్మినార్ నుంచి హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు వెళ్లే మార్గంలో అత్యంత విలువైన 5 ఎకరాల భూమిని కాజేయాలని కొంతమంది ప్రయత్నించారు అక్కడ రెండు తాత్కాలిక షెడ్డులు వేసి ఒక గదిని కూడా నిర్మించారు. 5 ఎకరాల చుట్టూ రేకుల షీట్లతో ప్రహరీ కూడా నిర్మించే క్రమంలో హైడ్రాకు రెవెన్యూ శాఖ నుంచి ఫిర్యాదు అందింది. ఎన్నో ఏళ్లుగా ఈ భూమి తనదిగా చెబుతూ ఎవరినీ అటువైపు రానీయకుండా అడ్డుకుంటున్న పరిస్థితుల్లో శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకు హైడ్రా రంగంలోకి దిగింది. రెండు తాత్కాలిక షెడ్డులతో పాటు నిర్మించిన గదితో పాటు ఫెన్సింగ్‌ను హైడ్రా తొలగించింది. మొత్తం ఆక్రమణలు తొలగించిన తర్వాత 5 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. అలాగే ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. ఈ భూమి విలువ దాదాపు రూ. వెయ్యికోట్ల వరకూ ఉంటుందని అంచనా!

బిజినెస్

ఉద్యోగులకు అలర్ట్.. ఈపీఎఫ్ఓ సేవలు 4 రోజులు బంద్!

దేశవ్యాప్తంగా కోట్లాది ఉద్యోగులు వినియోగించే ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఆన్‌లైన్ సేవలు కొన్ని రోజుల పాటు అందుబాటులో ఉండవు. సిస్టమ్ అప్‌గ్రేడ్, డేటా మైగ్రేషన్ పనుల కారణంగా సభ్యుల పోర్టల్, యజమానుల పోర్టల్, ఉమంగ్ యాప్‌లోని పలు కీలక సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఈపీఎఫ్‌వో ప్రకటించింది. జూన్ 26 నుంచి 29 వరకు ఈ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ కాలంలో పీఎఫ్ క్లెయిమ్‌లు దాఖలు చేయడం, క్లెయిమ్ ప్రాసెసింగ్, ఈ-పాస్‌బుక్ వీక్షించడం, కొత్త ఉద్యోగుల యూఏఎన్ లింకింగ్, ఈసీఆర్ ఫైలింగ్ వంటి సేవలు అందుబాటులో ఉండవు. సాంకేతిక మార్పుల ద్వారా మరింత వేగవంతమైన, సురక్షితమైన సేవలు అందించడమే దీని ఉద్దేశమని ఈపీఎఫ్‌వో తెలిపింది. సేవలు జూన్ 30 నుంచి తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. అయితే ఉమంగ్ యాప్‌లో కనిపిస్తున్న సమాచారం ప్రకారం కొన్ని సేవలు జులై 2 వరకు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో సభ్యులు, యజమానులు తమ అవసరాలను ముందుగానే పూర్తి చేసుకోవాలని సూచించింది. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఈపీఎఫ్‌వో హెల్ప్‌లైన్ 14470ను సంప్రదించాలని సంస్థ సూచించింది.

తెలుగువారి కంపెనీల్లో దివీస్ టాప్

హైదరాబాద్

దేశంలోని అత్యంత విలువైన 500 ప్రైవేట్ కంపెనీల జాబితాలో తెలుగువారికి చెందిన 39 సంస్థలకు చోటు దక్కింది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ అన్ని సంస్థల్లో దివీస్ లేబొరేటరీస్ రూ.1.7 లక్షల కోట్ల మార్కెట్ విలువతో అగ్రస్థానంలో నిలిచింది. డాక్టర్ రెడ్డీస్ (రూ.1.1 లక్షల కోట్లు), మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (రూ.83,800 కోట్లు) వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్నాయి. 2025 సంవత్సరానికిగాను యాక్సిస్ బ్యాంక్‌కు చెందిన బర్గండీ ప్రైవేట్, హురున్ ఇండియా సంయుక్తంగా విడుదల చేసిన ఈ రిపోర్టులోని మరిన్ని ముఖ్యాంశాలు. తెలుగువారి కంపెనీల మొత్తం విలువ రూ.12.1 లక్షల కోట్లకు పెరిగింది. 2021తో పోలిస్తే రూ.5.2 లక్షల కోట్లు (75 శాతం) పెరిగింది. ఐదేళ్లలో కంపెనీల సంఖ్య కూడా 30 నుంచి 39కి చేరింది. అందులో 16 హెల్త్‌కేర్ రంగానికి చెందినవే కావడం గమనార్హం. ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ రంగం నుంచి 5 కంపెనీలకు చోటు లభించగా.. ఇండస్ట్రియల్ ప్రొడక్ట్స్, ఆటోమొబైల్ అండ్ ఆటో కాంపోనెంట్స్ రంగాల నుంచి 3 చొప్పున సంస్థలున్నాయి. గత ఏడాదిలో మనోళ్ల కంపెనీల మొత్తం విక్రయాలు రూ.2.6 లక్షల కోట్లకు పెరిగాయి. ఐదేళ్లలో సేల్స్ రూ.83,625 కోట్ల (47 శాతం) మేర వృద్ధి చెందాయి. వీటిల్లో మొత్తం 3.4 లక్షల మంది పనిచేస్తున్నారు. గత ఐదేళ్లలో వీరి సంఖ్య 70 శాతం పెరిగింది. తెలుగోళ్ల కంపెనీల సగటు వయసు 37 ఏళ్లుగా ఉంది. అత్యధిక మంది మహిళలు పనిచేస్తున్న తెలుగు కంపెనీల్లో డాక్టర్ రెడ్డీస్ (8,480 మంది) టాప్‌లో ఉంది. మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్(8,143 మంది), రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ (3,427 మంది) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

రష్యాకు భారత పెట్రోల్.. ఉక్రెయిన్ దాడుల ప్రభావం!

ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో చమురు శుద్ధి కేంద్రాలు దెబ్బతినడంతో రష్యాలో పెట్రోల్ కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు భారత్ నుంచి పెద్ద ఎత్తున పెట్రోల్ దిగుమతి చేసుకునే దిశగా రష్యా అడుగులు వేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఉక్రెయిన్‌కు చెందిన కీవ్ పోస్ట్ కథనం ప్రకారం.. భారత్ నుంచి సముద్ర మార్గంలో పెట్రోల్ దిగుమతులను ప్రోత్సహించేందుకు రష్యా తన పన్ను చట్టాల్లో మార్పులు చేయాలని భావిస్తోంది. భారత్ నుంచి పెట్రోల్ దిగుమతి చేసే కంపెనీలకు సబ్సిడీలు అందించే ప్రతిపాదనకు రష్యా పార్లమెంట్ బడ్జెట్ కమిటీ మద్దతు తెలిపినట్లు సమాచారం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా ముడి చమురుకు భారత్ అతిపెద్ద కొనుగోలుదారుగా మారింది. ప్రస్తుతం రోజుకు 15 లక్షల నుంచి 20 లక్షల బ్యారెళ్ల ముడి చమురును భారత్ కొనుగోలు చేస్తోంది. 2026 జూన్‌లో ఈ దిగుమతులు రోజుకు 26.6 లక్షల బ్యారెళ్ల రికార్డు స్థాయికి చేరినట్లు నివేదిక పేర్కొంది. భారత్‌లోని రిఫైనరీల్లో శుద్ధి చేసిన చమురులో కొంత భాగాన్ని పెట్రోల్, ఇతర ఇంధన ఉత్పత్తుల రూపంలో విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. 2025లో భారత్ పెట్రోల్ ఎగుమతులు రోజుకు 4 లక్షల బ్యారెళ్ల రికార్డు స్థాయికి చేరాయి. ఉక్రెయిన్ దాడుల కారణంగా రష్యా చమురు శుద్ధి సామర్థ్యం గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రోజుకు సుమారు 85 వేల టన్నుల పెట్రోల్ మాత్రమే ఉత్పత్తి అవుతోంది. వేసవి కాలంలో డిమాండ్ 1.11 లక్షల టన్నుల వరకు ఉంది. దీంతో రోజుకు దాదాపు 25 వేల టన్నుల కొరత ఏర్పడినట్లు నివేదిక వెల్లడించింది. పెట్రోల్ కొరత కారణంగా రష్యాలో ఇంధన ధరలు పెరుగుతున్నాయి. పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందంటే కొందరు తేలికపాటి విమానాల నిర్వాహకులు విమాన ఇంధనానికి బదులుగా ఆటోమొబైల్ పెట్రోల్‌ను వినియోగించాల్సి వస్తోందని సమాచారం.

స్పోర్ట్స్

ఇంగ్లండ్‌తో మ్యాచ్-అంపైర్ నిర్ణయంపై వెస్టిండీస్ కెప్టెన్ అసంతృప్తి

స్పోర్ట్స్ డెస్క్:

మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా నిన్న(బుధవారం) వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 38 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది.గ్రూప్-ఎ నుంచి ఇంగ్లండ్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. అయితే ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ విజయం కంటే.. వెస్టిండీస్ కెప్టెన్ హేయిలీ మాథ్యూస్ ఔటైన తీరు, థర్డ్ అంపైర్ తీసుకున్న నిర్ణయం వివాదాస్పదంగా మారాయి. వెస్టిండీస్ ఇన్నింగ్స్ 4వ ఓవర్లో ఈ హైడ్రామా చోటుచేసుకుంది. ఇంగ్లండ్ బౌలర్ లిన్సే స్మిత్ వేసిన ఆఫ్ స్టంప్ వెలుపలికి బంతిని వేసింది. మాథ్యూస్ ఆ బంతిని కట్ చేయడానికి ప్రయత్నించగా.. అది వికెట్ కీపర్ అమీ జోన్స్ చేతుల్లో పడింది. ఇంగ్లండ్ ఆటగాళ్ల అప్పీల్ చేయగా ఆన్ ఫీల్డ్ అంపైర్ ఎన్. జనని నిరాకరించగా, ఇంగ్లండ్ రివ్యూ కోరింది. టీవీ రీప్లేలలో బ్యాట్‌కు, బంతికి మధ్య స్పష్టమైన గ్యాప్ ఉన్నట్లు దృశ్యాలు కనిపిస్తున్నప్పటికీ.. అల్ట్రాఎడ్జ్‌లో వచ్చిన ఒక చిన్న స్పైక్ ఆధారంగా థర్డ్ అంపైర్ నిమాలి పెరీరా మాథ్యూస్‌ను ఔట్‌గా ప్రకటించారు. ఈ నిర్ణయంపై వెస్టిండీస్ కెప్టెన్ హేయిలీ మాథ్యూస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ మైదానాన్ని వీడింది. మ్యాచ్ అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ..'బంతి నా బ్యాట్‌కు చాలా దూరంగా ఉంది. అల్ట్రా ఎడ్జ్‌లో వచ్చిన శబ్దం బంతిది కాదు, బహుశా నా బ్యాట్ హ్యాండిల్ ప్యాడ్‌కు తగలడం వల్ల వచ్చి ఉండవచ్చు. టీవీ స్క్రీన్‌పై స్పష్టమైన గ్యాప్ కనిపిస్తున్నా,టెక్నాలజీ ఆధారంగా అంపైర్ ఆ నిర్ణయం తీసుకున్నారు. దాన్ని గౌరవించక తప్పదు' అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్.. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' డాని వ్యాట్-హాడ్జ్ (42 బంతుల్లో 65 పరుగులు) మెరుపు ఇన్నింగ్స్‌తో 186 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం విండీస్‌ను 148 పరుగులకే కట్టడి చేసి సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.

కన్నీళ్లు పెట్టుకున్న బ్రెజిల్ స్టార్ నెయ్‌మార్!

స్పోర్ట్స్ డెస్క్:

ఫుట్‌బాల్ ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. బ్రెజిల్ ఫుట్‌బాల్ స్టార్, మాజీ కెప్టెన్ నెయ్‌మార్ దాదాపు మూడేళ్ల (981 రోజులు) సుదీర్ఘ విరామం తర్వాత తిరిగి జాతీయ జట్టు జెర్సీని ధరించాడు. ఫిఫా ప్రపంచకప్ 2026 గ్రూప్-సి లో భాగంగా స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో నెయ్‌మార్ మైదానంలోకి అడుగుపెట్టాడు. ఈ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై 3-0 తేడాతో బ్రెజిల్ ఘనవిజయం సాధించగా.. జట్టు విజయం కంటే నెయ్‌మార్ పునరాగమనమే అభిమానుల్లో ఎక్కువ ఉత్సాహాన్ని నింపింది. 2023 అక్టోబర్‌లో ఉరుగ్వేతో జరిగిన మ్యాచ్‌లో నెయ్‌మార్ మోకాలికి తీవ్ర గాయమైంది. ఆ తర్వాత సర్జరీ జరగడంతో సుదీర్ఘ విశ్రాంతి తీసుకున్నాడు. 34 ఏళ్ల వయసులో ఈ తరహా గాయం నుంచి కోలుకుని పునరాగమనం చేయడం అంత సులువు కాదు. కానీ, పట్టుదలతో శ్రమించిన నెయ్‌మార్.. మియామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో 76వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి ప్రవేశించాడు. అతడు వార్మప్ చేస్తున్న సమయం నుంచే స్టేడియంలోని అభిమానులు కరతాళ ధ్వనులతో హోరెత్తించారు. ఇక మ్యాచ్ అనంతరం నెయ్‌మార్ మాట్లాడుతూ... 'మూడేళ్ల తర్వాత మళ్లీ జాతీయ జెర్సీని ధరించడం మాటల్లో చెప్పలేనంత ఆనందాన్ని ఇస్తోంది. శారీరకంగా నేను బాగున్నాను. ఇన్నాళ్లూ ఆటకు దూరం కావడం మానసికంగా నన్ను కలచివేసింది' అంటూ భావోద్వేగానికి గురయ్యాడు. బ్రెజిల్ కోచ్ కార్లో అన్సెలోట్టి వ్యూహం ప్రకారమే నెయ్‌మార్ రెండో అర్ధభాగంలో బరిలోకి దిగాడు. ఈ మ్యాచ్‌లో బ్రెజిల్ స్టార్ వినిసియస్ జూనియర్ రెండు అద్భుత గోల్స్‌తో మెరిశాడు. 'మా ఆరాధ్య ఆటగాడు జట్టులోకి రావడం మాకందరికీ కొండంత బలాన్నిచ్చింది. అతడు మరింత రాణించి ఈ టోర్నీలో మాకు అండగా నిలుస్తాడని ఆశిస్తున్నాను' అని వినిసియస్ పేర్కొన్నాడు. నెయ్‌మార్ రాకతో బ్రెజిల్ శిబిరంలో సరికొత్త జోష్ నెలకొంది.

పెళ్లి పేరుతో మోసం.. స్టార్ క్రికెటర్‌పై సంచలన ఆరోపణలు!

స్పోర్ట్స్ డెస్క్:

ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ ప్లేయర్ అభిషేక్ పోరెల్‌పై ఓ యువతి సంచలన ఆరోపణలు చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మూడేళ్లుగా శారీరక సంబంధం పెట్టుకుని.. ఆపై మోసం చేశాడంటూ సదరు యువతి ఆరోపించింది. అంతేకాక తాను మోసపోయానంటూ పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కింది. పశ్చిమ బెంగాల్లోని హుగ్లీ జిల్లా మొగ్రా పోలీస్ స్టేషన్లో ఆ యువతి తన తల్లితో కలిసి వెళ్లి ఆ క్రికెటర్‌పై ఫిర్యాదు చేశారు. పెళ్లి పేరుతో మోసం చేయడమే కాకుండా.. తనపై దాడికి పాల్పడ్డాడని సదరు మహిళ తన ఫిర్యాదులో పేర్కొంది. యువతి ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఆ మహిళ అభిషేక్ పోరెల్‌తో గత మూడేళ్లుగా సహజీవనం చేస్తోంది. కొన్నాళ్లు వీరి బంధం బాగానే సాగినప్పటికీ.. 2025లో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఆ తర్వాత అభిషేక్ ఆమెకు క్రమక్రమంగా దూరమయ్యాడు. అలానే పెళ్లికి నిరాకరించడంతో ఈ వ్యవహారం కాస్తా పోలీస్ స్టేషన్ చేరింది. ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. తనపై వచ్చిన ఆరోపణలను 23 ఏళ్ల అభిషేక్ పోరెల్ తీవ్రంగా ఖండించాడు. తాను క్రికెట్లో రాణిస్తూ మంచి ఫామ్‌లో ఉన్నందుకే కొందరు కావాలనే తన పేరును వివాదాల్లోకి లాగుతున్నారని అన్నాడు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR
తెలుగు దిన పత్రిక

బాలయ్య కల సాకారం.. రాజధానిలో కొరటాల శివతో కొత్త చిత్రం ప్రారంభం

నటసింహం నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం రాబోతున్నట్లు ప్రకటన వచ్చిన నాటి నుంచే ఇండస్ట్రీలో అంచనాలు పెరిగాయి. ఆ అంచనాలకు మరింత ఊపునిస్తూ, ఈ క్రేజీ ప్రాజెక్ట్ (వర్కింగ్ టైటిల్ 'చీదీఖ 112') ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వేదికగా పూజా కార్యక్రమాలతో అట్టహాసంగా ప్రారంభమైంది. సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ వేడుక జరిగింది. ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై నిర్మాత సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సినిమాను సుమారు రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. ఆగస్టు నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, 2027 వేసవి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. అమరావతిలో ఈ సినిమాను ప్రారంభించడం వెనుక ఓ ప్రత్యేక కారణం ఉందని నిర్మాత సుధాకర్ చెరుకూరి వివరించారు. "రాజధాని అమరావతిలో ఒక భారీ సినిమా ప్రారంభోత్సవం చేయాలనేది బాలకృష్ణ గారి చిరకాల స్వప్నం.

చేతులు వేయడం, చనువు తీసుకోవడం ఇండస్ట్రీలో ప్రతి స్టేజ్‌లోనూ ఉంది: సింగర్ సునీత

-సినీ పరిశ్రమలోని చీకటి కోణాలపై సునీత సంచలన వ్యాఖ్యలు

-పవర్ ఉన్న వాళ్లు అవతలి వాళ్లను వాడుకోవాలని చూస్తారని వెల్లడి

-అవకాశాల కోసం అడపిల్లలు ఏడుస్తూనే భరిస్తారన్న సునీత

ప్రముఖ టాలీవుడ్ సింగర్ సునీత సినిమా పరిశ్రమలోని చీకటి కోణాలపై, ముఖ్యంగా మహిళల సేఫ్టీపై అత్యంత భయంకరమైన నిజాలను బయటపెట్టారు. ఇటీవల హేమ కమిటీ రిపోర్ట్, ఆ తర్వాత ఇండస్ట్రీలో మహిళల రక్షణపై డిబేట్స్ నడుస్తున్న తరుణంలో... సునీత తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చేసిన బోల్డ్ కామెంట్స్ ఇప్పుడు ఫిల్మ్ సర్కిల్స్‌ను షేక్ చేస్తున్నాయి. సినిమా ఇండస్ట్రీ కొత్తగా వచ్చే అమ్మాయిలకు ఎంతవరకు సేఫ్? అనే ప్రశ్నపై ఆమె స్పష్టంగా మాట్లాడారు. ఇండస్ట్రీలో కొనసాగడం అంత ఈజీ కాదని సునీత అన్నారు. "ఒక అమ్మాయి ఇండస్ట్రీకి రావాలంటే ఆమెకు కచ్చితంగా నాలుగు శక్తులు ఉండాలి. అవి.. ఎమోషనల్ (మానసిక స్థైర్యం), ఫిజికల్, మెంటల్, ఫైనాన్షియల్ స్ట్రెంత్స్. ఈ నాలుగూ లేకపోతే ఇండస్ట్రీ ఇక్కడ ప్రతి క్షణం నరకం చూపిస్తుంది. కఠినమైన పరీక్ష పెడుతుంది. ఇండస్ట్రీ అసలు సేఫ్ కాదు" అని స్పష్టం చేశారు. ఇండస్ట్రీలో అథారిటీ, పవర్ చేతుల్లో పెట్టుకున్న కొందరు వ్యక్తులు... అవతలి వారి బలహీనతలను ఎలా క్యాష్ చేసుకుంటారో సునీత దాపరికం లేకుండా వెల్లడించారు. "ఇక్కడ పవర్ ఉన్నవాళ్లు అవతలి వారిని వేధించాలని లేదా వాడుకోవాలని చూస్తారు. కేవలం కొత్తగా ఛాన్సుల కోసం వచ్చే వాళ్లనే కాదు... ఇండస్ట్రీలో ఆల్రెడీ మంచి పేరు, క్రేజ్ తెచ్చుకున్న వాళ్లను కూడా వదలరు. చేతులు వేయడం, అనవసరమైన చనువు తీసుకోవడం వంటివి ప్రతి స్టేజ్‌లో ఉంటాయి" అని తెలిపారు. "ఒక మగాడు ఏ ఉద్దేశంతో మాట్లాడుతున్నాడో... ఆ మాటల్లోనే లేదా అతడు తాకిన ఒకే ఒక్క టచ్‌లోనే ఆడపిల్లలకి వెంటనే తెలిసిపోతుంది. చాలా మంది వేరే దారి లేక, సినిమా అవకాశాల కోసం అవన్నీ భరిస్తూ లోపల ఏడుస్తారు. కానీ, నాలాంటి వాళ్లు మాత్రం ఆ పనులు చేయకుండా, అలాంటి వాతావరణం నచ్చక ఇండస్ట్రీ నుండి బయటకు వచ్చేస్తారు" అని సునీత చెప్పారు.

పవన్ ఫ్యాన్స్‌కు కిక్ ఇచ్చే న్యూస్.. అధికారికంగా 'ఓజీ2' ప్రకటన.. ఆసక్తి రేపుతున్న వీడియో!

-ఇది 'ఓజీ యూనివర్స్'లో భాగంగా రానున్నట్లు మేకర్స్ వెల్లడి

-దర్శకుడు సుజీత్, పవన్ కల్యాణ్ మధ్య జరిగిన చర్చల వీడియో విడుదల

-'గంభీర' అన్‌టోల్డ్ స్టోరీగా రానున్న సీక్వెల్

-సీక్వెల్‌కు పూర్తి మద్దతు ప్రకటించిన పవన్ కల్యాణ్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులకు చిత్రబృందం అదిరిపోయే శుభవార్త చెప్పింది. ఆయన హీరోగా దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'దే కాల్ హిమ్ ఓజీ'కి సీక్వెల్ రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. కేవలం సీక్వెల్ మాత్రమే కాకుండా, ఇది 'ఓజీ యూనివర్స్'లో భాగంగా ఉండనుందని స్పష్టం చేసింది. ఈ మేరకు పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై ఈ ప్రాజెక్ట్ రానున్నట్లు వెల్లడించారు. పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ తమ 'ఎక్స్' ఖాతాలో ఓ ప్రత్యేక వీడియోను పంచుకుంది. ఇందులో దర్శకుడు సుజీత్, పవన్ కల్యాణ్ 'ఓజీ' ఫ్రాంచైజీలోని రెండో భాగం గురించి చర్చిస్తున్న దృశ్యాలు ఉన్నాయి. "తుఫానుకు ముందు ప్రశాంతత ఉంటుంది. గంభీర చెప్పని కథ ఇప్పుడు ఆవిష్కృతం కాబోతోంది" అని నిర్మాణ సంస్థ పేర్కొంది. సుజీత్ ఆలోచనలకు, కథనానికి ముగ్ధుడైన పవన్, తన వైపు నుంచి కావాల్సినదంతా సిద్ధంగా ఉంటుందని హామీ ఇవ్వడం ఈ వీడియోలో స్పష్టంగా కనిపించింది. ఈ సీక్వెల్ కేవలం ఓ కొనసాగింపు చిత్రం కాదని, అనేక పాత్రలు, వాటికి సంబంధించిన లోతైన కథలతో కూడిన ఓ పెద్ద సినిమాటిక్ అనుభూతిని ఇస్తుందని వీడియో ద్వారా తెలుస్తోంది. 'ఓజీ యూ నివర్స్' పరిధిని వివరిస్తూ, సుజీత్ కొన్ని ఆసక్తికరమైన అంశాలను పవన్‌తో పంచుకున్నారు. సినిమాలో మంచు నెమ్మదిగా రక్తంగా మారే సన్నివేశం, ఓ రహస్యమైన 'అవుట్‌సైడర్' పాత్ర, 'ఓజీ' పెంపుడు జంతువు ప్రాముఖ్యత వంటి విషయాలను వివరించారు. 'ఓజీ 2'లో ఓ సన్నివేశం 'ఐకానిక్ విజువల్'గా నిలిచిపోతుందని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించడం ఇప్పుడు అభిమానుల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో వచ్చిన 'దే కాల్ హిమ్ ఓజీ' భారీ విజయాన్ని సొంతం చేసుకోవడమే కాకుండా, పవన్ కల్యాణ్‌ను ఓ సరికొత్త లార్జర్ దేన్ లైఫ్ అవతార్‌లో చూపించింది. సుజీత్ దర్శకత్వంలో వచ్చిన ఈ స్టైలిష్ గ్యాంగ్‌స్టర్ డ్రామా, సినిమా పట్ల పవన్ కల్యాణ్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. తాజాగా ఈ సీక్వెల్ చర్చలు 'ఓజీ యూనివర్స్' ఎంత భారీగా ఉండనుందో చిన్న హింట్ ఇచ్చి, అభిమానుల్లో ఆసక్తిని రెట్టింపు చేశాయి.

కార్తి 'సర్దార్ 2' విడుదల తేదీ ఖరారు!

హీరో కార్తి కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్ 2' విడుదల తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని 2026, సెప్టెంబర్ 10న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఒక పవర్‌ఫుల్ ప్రమోషనల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఈ వీడియోలో రా ఏజెంట్ చంద్రబోస్ అలియాస్ సర్దార్ పాత్రలో కార్తి వృద్ధుడి గెటప్‌లో కనిపించి ఆకట్టుకున్నారు. మంటల మధ్య రైఫిల్ పట్టుకుని నిలబడిన ఆయన లుక్, సినిమాలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఉండనున్నాయని స్పష్టం చేస్తోంది. "ఏజెంట్ కార్తి వస్తున్నాడు.. జీవితకాలపు మిషన్‌కు సిద్ధంగా ఉండండి" అనే క్యాప్షన్‌తో ఈ అప్‌డేట్‌ను పంచుకున్నారు. 2022లో ఘన విజయం సాధించిన 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా ఇది తెరకెక్కుతోంది. మొదటి భాగం రూ. 100 కోట్లకు పైగా వసూళ్లు సాధించడంతో, ఈ సీక్వెల్‌ను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. పి.ఎస్. మిత్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సర్దార్ ఆరిజిన్ స్టోరీతో పాటు, అతని కుమారుడు ఇన్‌స్పెక్టర్ విజయ్ సాహసాలను కూడా చూపించనున్నారు. ఇందులో ఎస్‌జే సూర్య 'బ్లాక్ డాగర్' అనే శక్తివంతమైన ప్రతినాయకుడి పాత్రలో నటిస్తుండగా, మాళవిక మోహనన్, యోగి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ జులై 2024లో ప్రారంభమై జూన్ 2025లో పూర్తయింది. శ్యామ్ సీఎస్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. తెలుగు, తమిళంతో పాటు హిందీ, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ సినిమాను భారీ స్థాయిలో విడుదల చేయనున్నారు. త్వరలోనే ట్రైలర్‌కు సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ వెలువడనున్నాయి.

'లవ్ అండ్ వార్' సెట్స్‌లో కార్మికుడి మృతి.. దర్శకుడు భన్సాలీపై ఎఫ్ఐఆర్‌కు డిమాండ్!

-సెట్స్‌లో విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయిన కార్పెంటర్

-సెట్స్‌లో సరైన భద్రతా ప్రమాణాలు పాటించలేదని ఏఐసీడబ్ల్యూఏ ఆరోపణ

-బాధిత కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని డిమాండ్

-నిబంధనల ఉల్లంఘనపై విచారణకు విజ్ఞప్తి

ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీతో పాటు ఆయన ప్రొడక్షన్ హౌస్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆల్ ఇండియా సినీ వర్కర్స్ అసోసియేషన్ (ఏఐసీడబ్ల్యూఏ) డిమాండ్ చేసింది. భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'లవ్ అండ్ వార్' సినిమా సెట్స్‌లో కార్పెంటర్ చంద్రధారి సింగ్ యాదవ్ మరణించడమే ఇందుకు కారణం. మృతుడి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, సెట్స్‌లో భద్రతా లోపాలపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని అసోసియేషన్ కోరింది. ముం బైలోని ఫిల్మ్ సిటీ స్టూడియోలో ఈ నెల 21న షూటింగ్ సెట్ పనులు జరుగు తుండగా, 42 ఏళ్ల యాదవ్ విద్యుదా ఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, భన్సాలీ ప్రొడక్షన్స్ మృతుడి కుటుంబానికి రూ. 40 లక్షల పరిహారం అందించేందుకు ముందుకు వచ్చినట్లు సమాచారం. సీఎంకు లేఖ – భద్రతా లోపాల పై ఆరోపణలు ఈ ఘటనపై ఏఐసీడబ్ల్యూఏ అధ్యక్షుడు సురేష్ శ్యామ్‌లాల్ గుప్తా.. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. రణబీర్ కపూర్, విక్కీ కౌశల్, అలియా భట్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ సినిమా సెట్స్‌లో సరైన భద్రతా ప్రమాణాలు పాటించలేదని ఆయన ఆరోపించారు. నిర్లక్ష్యం కారణంగా జరిగిన మరణం కింద భన్సాలీ, ప్రొడక్షన్ హౌస్‌తో పాటు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. సెట్స్‌లో భద్రతా ప్రమాణాలను తనిఖీ చేసే వరకు షూటింగ్‌ను నిలిపివే యాలని, గతంలో భన్సాలీ తీసిన 'దేవదాస్', 'పద్మావత్' సినిమాల సమయంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయని అసోసియేషన్ గుర్తు చేసింది. ఫెడరేషన్ ఆఫ్ వెస్టర్న్ ఇండియా సినీ ఎంప్లాయీస్ (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) కూడా సినిమా సెట్స్‌పై కార్మికుల భద్రతను కఠినతరం చేయాలని డిమాండ్ చేసింది. 'గంగూబాయి కతియావాడి' తర్వాత భన్సాలీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం 2027 జనవరి 21న విడుదల కావాల్సి ఉంది. ఈ వివాదంపై భన్సాలీ ప్రొడక్షన్స్ నుండి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం పోలీసులు ఈ ప్రమాదంపై ప్రాథమిక విచారణ జరుపుతున్నారు. ఇప్పటివరకు ఎవరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.